పొంచి ఉన్న నీటిఎద్దడి

- ఊసేలేని రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణం
- ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలకు బ్రేక్
- బోరు నీళ్లతోనే సరిపెడుతున్న పలు కాలనీల వాసులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు


ఓవర్‌హెడ్ ట్యాంకు

బాపట్ల: జిల్లా కేంద్రమైన బాపట్ల పట్టణంలో మంచినీటి ఎద్దడి పొంచి ఉంది. నలభై ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుతోనే కాలం నెట్టుకొస్తున్నారు. రెండో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు విషయమైన ప్రతిపాదనలు ఇప్పట్లో కనిపించటంలేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణంతోపాటు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు తీసుకుని వాటికి అనుమతులు మంజూరుకు సిద్ధమవుతున్న సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం జరిగింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మంచినీటి సరఫరాపై దృష్టి పెట్టలేదు.

రెండో ట్యాంకు ప్రతిపాదనలు ఇలా..

బాపట్ల పట్టణంలో ప్రస్తుతం 50 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు ఉంది. కృష్ణానది నుంచి వచ్చే నీటిని ఈ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకుతో నింపుతారు. రెండుసార్లు ఈ ట్యాంకును నింపి పట్టణానికి నీటి సరఫరా చేస్తారు. వేసవిలో నీటిఎద్దడి ఎక్కువగా ఉంటే రెండు, మూడు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేసి కాలం నెట్టుకొస్తున్నారు. ఈనేపథ్యంలో వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు రెండో సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న ట్యాంకు పక్కనే 100.80ఎకరాలు భూసేకరణ చేసే పనులకు శ్రీకారం చుట్టాలని ప్రతిపాదనలు పంపారు. ఈరెండు ట్యాంకులు ఒక చోటే ఉండటం వలన ప్రత్యేకంగా ట్యాంకును నింపేందుకు అవసరమైన కాలువలు తవ్వే పని లేకుండా ఉంటుందని, ఖర్చులు కూడా తగ్గించవచ్చని ప్రతిపాదించారు.

పెరిగిన జనాభాకు చాలని నీటివనరులు..

ప్రస్తుతం పట్టణంలో ఐదు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా వాటిలో ఉప్పరపాలెం ట్యాంకు పనులు కూడా పూర్తి చేసేందుకు ఈ ప్రభుత్వం వెనుకంజ వేస్తుంది. ఈ ట్యాంకుతోపాటు అదనంగా ప్యాడిసన్‌పేట, బేతనీ కాలనీ, డ్రైవర్స్ కాలనీలో ఓవర్ హెడ్‌ట్యాంకులు నిర్మించేందుకు ప్రతిపాదించారు. వీటికి అనుమతులు వస్తేనే మంచినీరు సజావుగా సరఫరా చేసేందుకు అవకాశం కనిపిస్తుంది. గతంలో కేవలం 30వేలమంది జనాభాకు డిజైన్ చేసిన ట్యాంకుతోనే నేడు 1.08లక్షలమంది ప్రజలకు నీటి సరఫరా చేస్తున్నారు. అప్పట్లో కేవలం 4వేలకు ఉన్న కుళాయిల కనెక్షన్ల సంఖ్య ఇప్పుడు 12,700లకు పెరిగిపోవటంతో విడుదల చేస్తున్న నీరు సరిపోని పరిస్థితి నెలకొంది. దీంతో పలు కాలనీల్లోని ప్రజలు ఇప్పటికీ బోరు నీళ్లతోనే దాహం తీర్చుకోవాల్సిన దుస్థితి. ఇప్పటికైనా ప్రతిపాదనలో ఉన్న మంచినీటి ట్యాంకు, ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం సత్వరం చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రతిపాదనలు సిద్ధం

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి 100 ఎకరాలు ట్యాంకు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయి. వీటితోపాటు పట్టణంలో మరో మూడు ఓవర్‌హెడ్ ట్యాంకులకు ప్రతిపాదనలు పంపాం. పట్టణ ప్రజలకు సజావుగా నీటి సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ

క్లుప్తంగా

పంట నమోదుతో రైతులకు మేలు



పిట్టలవానిపాలెం(కర్లపాలెం): పంట నమోదుతో రైతులకు మేలు జరుగుతుందని పిట్టలవానిపాలెం తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ చెప్పారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం, గోకరాజు నల్లిబోయినవారిపాలెం గ్రామాలలో తహసీల్దార్ పరిశీలించి పంట నమోదు కార్యక్రమాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పంట నమోదుపై రైతులకు అవగాహన కల్పించి పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించాలని చెప్పారు. ఏఈఓ సుదర్శన్‌రావు, వీఆర్వోలు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

యలవర్రులో పల్లె నిద్ర

అమర్తలూరు(వేమూరు): గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్‌ఐ అమర్ వర్ధన్ పేర్కొన్నారు. అమర్తలూరు మండలం యలవర్రు గ్రామంలో శుక్రవారం రాత్రి గ్రామ సచివాలయం వద్ద ఆయన పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో గొడవలు పోత్సహించరాదన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొని రావాలన్నారు. మద్యం, పేకాట వల్ల అనేక కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి



బాపట్లటౌన్: నాగరాజు కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఈపూరి నాగరాజు (25) శనివారం ఉదయం మృతిచెందారు. పట్టణంలోని ఉప్పరపాలెం గ్రామానికి చెందిన నాగరాజు పట్టణంలోని ఎస్ఎస్‌పి అగ్రహారంలో బిర్యానీ పాయింట్ నిర్వహిస్తున్నాడు. మహిళతో వివాహేతర సంబంధం నేపథ్యంలో ఇటీవల కుటుంబ సభ్యులు మందలించారు. మనస్థాపానికి గురైన నాగరాజు శుక్రవారం రాత్రి మండలంలోని నాగరాజు కాలువలో దూకారు. నాగరాజు కోసం రూరల్ పోలీసులు రాత్రంతా గజ ఈతగాళ్ల సాయంతో గాలించారు. శనివారం శవమై కనిపించారు. రూరల్ సీఐ గంగాధరరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి, అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

యోగా శిక్షకుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

మున్నంగి(కొల్లిపర): యోగాలో పీజీ, డిగ్రీ, డిప్లొమా చేసిన వారు శిక్షకులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన స్త్రీ, పురుషులు దరఖాస్తు చేసుకోవాలని మున్నంగి ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ టి.సాయి కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

యానాది మత్స్యకారుల ఆర్థిక పరిపుష్టికి చర్యలు

మత్స్యశాఖ సహాయ సంచాలకులు సైదానాయక్


యానాది మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ అధికారి సైదా నాయక్

రేపల్లె రూరల్: యానాది మత్స్యకారులకు ఆర్థికంగా పరిపుష్టి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మత్స్యశాఖ సహాయ సంచాలకులు బి.సైదానాయక్ చెప్పారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని బొబ్బర్లంక గ్రామంలో యానాది మత్స్యకార సంఘాల ఏర్పాటుకై శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. యానాది మత్స్యకారులు కాలువలు, నదులలో చేపలవేట చేస్తూ జీవనోపాధి పొందుతున్నట్లు గుర్తించామన్నారు. వీరిపై ప్రత్యేక దృష్టి సారించి మత్స్యకార సంఘాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సంఘాలు ఏర్పడటంతో వివిధ రకాల వలలు, ద్విచక్రవాహనాలు, ఐస్‌బాక్స్‌లు, నాలుగు చక్రాల చేపల రవాణా వాహనాలు, పెన్షన్‌లు, పడవలు తదితర పథకాలను పొందేందుకు అవకాశం కలుగుతుందన్నారు. ప్రతి యానాది మత్స్యకారుడు సంఘంలో సభ్యుడిగా చేరాలని పేర్కొన్నారు. యానాది సంఘం రాష్ట్ర మహానాడు నాయకుడు తిరుమలశెట్టి శ్రీను, జిల్లా అధ్యక్షుడు కొమరగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేక చర్యలు

డీబీఆర్‌సీ కార్యదర్శి అల్లాడి దేవకుమార్


లంక గ్రామాల్లో సహాయ కార్యక్రమాల వివరాలను కలెక్టర్‌కు అందజేస్తున్న డీబీఆర్‌సీ బృందం

బాపట్ల టౌన్: కృష్ణానది వరద బాధిత గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని దళిత బహుజన రీసోర్స్ సెంటర్ (డీబీఆర్‌సీ) కార్యదర్శి అల్లాడి దేవకుమార్ పేర్కొన్నారు. ఈమేరకు ప్రణాళికను జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళికి అందించారు. భట్టిప్రోలు మండలంలోని దళిత, గిరిజన కుటుంబాల్లో ఆర్థికపరమైన, ఆరోగ్యపరమైన తోడ్పాటునందించేందుకు రూ.కోటిన్నరతో ప్రణాళికను సిద్ధం చేసుకున్నామని సంస్థ కార్యదర్శి అల్లాడి దేవకుమార్ తెలిపారు. వరద సమయంలో ఐదువేల కుటుంబాలకు ఆహార పదార్థాలు, నిత్యావసర సరుకులు అందించామని చెప్పారు. సంస్థ ప్రోగ్రామ్స్ డిప్యూటీ డైరెక్టర్ సిహెచ్ శామ్యూల్ అనిల్ కుమార్, రీసెర్చ్ సెల్ డిప్యూటీ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ట్రైనింగ్ కో–ఆర్డినేటర్ హేమలత, ఏరియా కో–ఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ పాల్గొన్నారు.

రేపు బాపట్లలో వీసీబీ నూతన బ్రాంచ్ ప్రారంభం

విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు



సమావేశంలో మాట్లాడుతున్న చలసాని

బాపట్ల: బాపట్ల పట్టణంలో విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు(వీసీబీ) నూతన బ్రాంచిని ప్రారంభించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు తెలిపారు. ఈనెల ఏడో తేదీన పట్టణంలో బ్యాంక్ 54 బ్రాంచ్ ప్రారంభం సందర్భంగా శనివారం బ్యాంకు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో గుజరాత్, మహారాష్ట్ర మినహా సహకార అర్బన్ బ్యాంకులలో అతిపెద్ద సహకార అర్బన్ బ్యాంకుగా గుర్తింపు పొందినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో 53 బ్రాంచిలతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటివరకు రూ. 4,263.73 కోట్ల డిపాజిట్లు సేకరించి, రూ.3,359.41 కోట్లు రుణాలు మంజూరు చేశామన్నారు. మొత్తం రూ.7,623.14 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయన్నారు. 1,08,528 మంది సభ్యులతో రూ.374.23 కోట్ల షేరు ధనం కలిగి ఉన్నట్లు చెప్పారు. డైరెక్టర్లు జేవీ సత్యనారాయణ మూర్తి, చిన్నం కోటేశ్వరరావు, ఉపముఖ్య కార్యనిర్వహణాధికారి వి.వి.బి.వరలక్ష్మి, జోనల్ మేనేజర్ సీహెచ్ వీఆర్ సుబ్రహ్మణ్యం, బ్రాంచ్ మేనేజర్ ఎ.అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా విజయవంతంగా మందుల పంపిణీ


డ్రోన్ డెలివరీ పైలెట్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న డాక్టర్ లక్ష్మీసుధ, ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర: రానున్న రోజుల్లో అతి తక్కువ ఖర్చుతో ఒకచోట నుంచి మరొక చోటకు 10 కేజీల వరకు డ్రోన్ ద్వారా మందులు పంపిణీ చేయవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ తెలిపారు. శనివారం మెడిసిన్ – డ్రోన్ డెలివరీ పైలెట్ ప్రాజెక్ట్ ద్వారా శనివారం మున్నంగి పీహెచ్‌సీ నుంచి అన్నవరపులంకలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో ఉన్న ఏఎన్ఎంకు మందులు డెలివరీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిక్కాల లక్ష్మీసుధ మాట్లాడుతూ డ్రోన్ ద్వారా మందులు పంపిణీని ప్రయోగాత్మకంగా పరిశీలించినట్లు చెప్పారు. పీహెచ్‌సీ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అన్నవరపులంకకు పది నిమిషాల్లో పంపినట్లు తెలిపారు. ఈ విధంగా ప్రభుత్వం అన్ని చోట్లా పరిశీలిస్తుందని, ఈ పద్ధతి విజయవంతం అయితే త్వరలో అన్ని చోట్ల డ్రోన్‌తో మందులు పంపిణీ చేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముఠా కార్మికుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముఠా కార్మికుడు మృతి చెందిన ఘటన ఐదో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సెక్టార్–1 పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, సీతానగర్‌లోని కేఎల్‌రావు కాలనీలో నివాసం ఉంటున్న తాతా వెంకట లక్ష్మణ్(24) వన్‌టౌన్‌లో ముఠా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల 3వ తేదీ ఉదయం పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై నగరానికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇంటికి బయలుదేరాడు. సీతమ్మ వారి పాదాలు సమీపానికి చేరుకోగానే వాహనం అదుపు తప్పడంతో కిందపడటంతో తలకు బలమైన గాయమైంది. స్థానికులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పరాశక్తి నమోస్తుతే..!

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా శనివారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవార్లు, దేవాలయాలలో అమ్మవార్లు ప్రత్యేక అలంకారాలలో భక్తులకు దర్శనమిచ్చారు. దర్శించుకున్న భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

– భట్టిప్రోలు/నగరం/కర్లపాలెం/ చెరుకుపల్లి / రేపల్లె రూరల్


నగరం సంత బజార్‌లో అన్నపూర్ణదేవీ అలంకరణలో దర్శనమిస్తున్న అమ్మవారు


కర్లపాలెం పెద్దింటమ్మ ఆలయంలో గాయత్రీదేవి అలంకరణలో పూజలందుకున్న అమ్మవారు


ఇసుకపల్లిలో వైష్ణవిదేవిగా..


రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో మంగళగౌరిగా భక్తులకు దర్శనమిస్తున్న గ్రామదేవత బూరుగులమ్మ


కోనేటిపురంలో శాకంబరీగా కనకదుర్గ అమ్మవారు


భట్టిప్రోలులో అన్నపూర్ణ దేవి అలంకారంలో వాసవి అమ్మవారు


భట్టిప్రోలు వాసవి దేవాలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


చెరుకుపల్లి బాలకోటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి

నష్ట పరిహార జాబితాలు సత్వరం వెలువరించాలి

కొల్లూరు: కృష్ణానదికి సంభవించిన వరదల కారణంగా వాటిల్లిన నష్టాల నమోదు జాబితాలలో లోపాలను గాజుల్లంకకు చెందిన వరద బాధితులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ పంటలు ముంపునకు గురై నష్టపోవడం, గృహ నష్టం, వాహన నష్టం తదితర జాబితాల తయారీలో అవకతవకలు చోటు చేసుకున్నాయని వాపోయారు. నష్ట నమోదు రాయించుకున్నవారే రాయించుకున్నారని, నిజంగా నష్టపోయిన సామాన్యులకు నష్ట నమోదు జాబితాలలో స్థానం దక్కలేదని కలెక్టర్ జె.వెంకట మురళి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తాము జాబితాలు ఇవ్వాలని కోరుతున్నా, జాబితాలు బయట పెట్టకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఫోన్ ద్వారా జిల్లా అధికారులను సోమవారం లోపు ఎట్టి పరిస్థితుల్లో జాబితాలను సచివాలయాలలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. బాధితులతో మాట్లాడుతూ, జాబితాలు అందుబాటులోకి వస్తాయని, పరిశీలించి అర్హత ఉన్న వారి పేర్లు నమోదు చేయకపోవడం, అనర్హులకు నష్ట పరిహారం అందినట్లు గుర్తించిన పేర్లు తదితరాలను అధికారులకు ఫిర్యాదు రూపంలో అందజేసిన పక్షంలో పరిహారం అందని వారికి అందజేయడంతోపాటు, అనర్హుల పేర్లు జాబితాలలో ఉండటంపై చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

తొమ్మిదిమంది పేకాట రాయుళ్ల అరెస్ట్

రేపల్లె రూరల్: పేకాట ఆడుతున్న తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్న సంఘటన పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని లక్ష్మీ టాకీసు సెంటరులో తమ సిబ్బందితో దాడులు చేశామన్నారు. దాడులలో తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకోవటం జరిగిందన్నారు. వీరి వద్ద నుంచి రూ.8900 నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

అసభ్య పదజాలంతో దూషించాడంటూ కేసు నమోదు

కర్లపాలెం: వైఎస్సార్ సీపీ కార్యకర్త మార్పు రత్నంపై శనివారం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. కర్లపాలెం ఎస్ఐ ఎస్.రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కర్లపాలెం మండలం కట్టావాద గ్రామానికి చెందిన మార్పు రత్నం అప్పటి టీడీపీ బాపట్ల ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యేపై మే 12వ తేదీన అనుచిత వ్యాఖ్యలు చేశాడని అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని టీడీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు ఏపూరి భూపతిరావు శనివారం ఫిర్యాదు ఇచ్చాడని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

8న తెనాలిలో వేద మహాసభ

తెనాలి రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లోకహితాన్ని కాంక్షిస్తూ వేదిక బ్రాహ్మణ సేవా సమాఖ్య తెనాలి ఆధ్వర్యంలో ఈనెల 8న వేద మహాసభను నిర్వహించనున్నారు. స్థానిక నాజరపేటలోని అనుగోలు వారి వీధిలోని విద్యా శంకర భారతి నృసింహసదనం వేద పాఠశాల ప్రాంగణంలో ఉదయం ఎనిమిది గంటలకు పండిత విష్ణుభట్ల లక్ష్మీపతి సోమయాజులు పర్యవేక్షణలో సభ ప్రారంభమవుతుందని సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి తెలిపారు. సదన భవనంలో శనివారం వేదసభ కరపత్రాలను సమాఖ్య కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మూర్తి మాట్లాడుతూ సేవా సమాఖ్య లోకహితం కోసం అనేక ధార్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా అత్యంత పర్వదినాలైనా శరన్నవరాత్రి రోజుల్లో వేద సభ నిర్వహిస్తే ప్రజలకు సంపూర్ణ ఆశీర్వాదం లభిస్తుందని పేర్కొన్నారు. సమాఖ్య గౌరవాధ్యక్షులు భాగవతుల కామేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మేడూరి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి రావినూతల రాజేంద్రప్రసాద్, మేళ్లచెరువు అనిల్ కుమార్, పింగళి వేణుధర్, టి. ఆంజనేయులు, గౌరవ సలహాదారులు తంగిరాల వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నారాయణం వేణుగోపాల్, సీఎంకే తిరుమలరావు, బుర్ర ప్రభాకరశర్మ, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నేడు టీ-20 క్రికెట్ జట్టు ఎంపిక

తెనాలి రూరల్: రాష్ట్ర టీ–20 క్రికెట్ జట్టు ఎంపిక ఆదివారం ఉదయం జరుగుతుందని ఏపీ యూత్ టీ–20 క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్. భాస్కర్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్ ఆవరణలో గల యువ క్రికెట్ అకాడమీలో ఎంపిక జరుగుతుందని పేర్కొన్నారు. ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ ఫోటోలు, తెల్ల దుస్తుల్లో సెలక్షన్స్‌కు రావాలని ఆయన సూచించారు. ఎంపికైన జట్టు నవంబర్ 1 నుంచి 4వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న నేషనల్ టీ–20 క్యాష్ ప్రైజ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటుందని పేర్కొన్నారు. వివరాలకు 7989215572 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నెలరోజులుగా ముంపులోనే..

- ఇంకా ముంపులోనే భట్టిప్రోలు కొత్త విఠలేశ్వర నగర్ కాలనీ
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- మురుగు నీటిలో మగ్గుతున్న గృహాలు


ముందుకు కదలని మురుగు నీరు


ఓ వీధిలో గృహాన్ని చుట్టిన నాచుతో కూడిన మురుగు

భట్టిప్రోలు: అసలే వర్షాకాలం ఆపై వ్యాధులు ప్రబలడం, దీనికి తోడు వర్షాలతో గత నెల రోజులుగా భట్టిప్రోలు కొత్త విఠలేశ్వర నగర్ కాలనీ ముంపులో ఉంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ కాలనీ వాసులు ప్రధాన రహదారికి చేరుకోవాలంటే నానా యాతన పడుతున్నారు. అసలే లోతట్టు ప్రాంతం దీనికి తోడు కాలనీ పక్కగా వెల్లటూరు ఛానల్ సాగునీటి కాల్వ పారుతుండటంతో ఊట నీరు దిగి మరింత ముంపుకు గురవుతుంది. ఈ కాలనీ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు కావస్తున్నా మెరకలు, సరైన రహదారులు లేకపోవడం వల్ల ఏటా ఏ కొద్దిపాటి వర్షం కురిసినా పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. పక్కా డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడం వర్షపు నీరు ఎటూ పోయే మార్గం లేక రెండూ ఏకమై రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. ఇళ్లల్లో వాడుకున్న వృధా నీరు, బాత్రూమ్ వాటర్ అంతా వర్షపు నీరుతో ఏకమైంది. ఈ నీటిలోనే రహదారిపైనే కాలనీ వాసులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. కాలనీకి సమీపంలో ఉన్న పంచాయతీ చెరువుకు కాల్వ నుంచి నీరు పెట్టుకునేందుకు తూములు ఏర్పాటు చేశారు. కాల్వలో ఉన్న తూములు బిగించకపోవడం వల్ల నీరు ఉధృతంగా పారడంతో తూముల ద్వారా సాగునీరు చేరి కాలనీ ముంపునకు గురవుతుంది. సుమారు 200 కుటుంబాలకు పైగా ఈ కాలనీలో నివాసం ఉంటున్నాయి. గతంలో చెరువు పూడిక తీయించాలని కాలనీ వాసులు పంచాయతీకి విన్నవించుకున్నారు. ఐనప్పటికి ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ద్విచక్రవాహనాలు మొరాయించి మరమ్మతులకు గురవుతున్నాయి.

ప్రతి ఏటా వర్షా కాలంలో ఇదే తంతు..

వర్షాకాలం వచ్చినప్పుడల్లా స్థానికులకు ఈ కష్టాలు తప్పడం లేదు. కనీసం కచ్చా డ్రైయినేజీ వ్యవస్థ కల్పించడంలో అధికారులు శ్రద్ధ కొరవడింది. ఎన్నికల సమయంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపడతామని నాయకులు హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. పంచాయతీ కార్యదర్శి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ స్థానికులకు పరిస్థితి వివరిస్తే దాటవేసే ప్రయత్నం చేస్తున్నారు. నీరు నిల్వ చేరడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు ఇప్పటికే జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్, సున్నం చల్లడం లేదని వాపోతున్నారు.

మురుగు నీటిలోనే కుళాయిలు ...

కాలనీలో తాగునీటి అవసరాల కోసం పంచాయతీ ఏర్పాటు చేసిన కుళాయిలు మురుగు నీటిలో మగ్గుతున్నాయి. కాలనీ వాసులు సీజనల్ వ్యాధులకు గురై విష జ్వరాల బారిన పడకముందే పంచాయతీ, వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాములు ఇళ్లలోకి వస్తున్నాయి...



కాలనీలో రహదారులు సైతం నీటిలో మునిగిపోవడం వల్ల పాములు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయి. చిన్న పిల్లలు నీటిలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ముంచెత్తిన నీటిని బయటకు మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలి. వారాలు తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది.

–పసుపులేటి శివరామ ప్రసాద్, సామాజిక కార్యకర్త

నిల్వ చేరిన నీటిని తోడించేలా చూస్తాం..



ఈ కాలనీ దుస్థితి మాకు తెలుసు. నిల్వ చేరిన నీటిని తోడించేలా చూస్తాం. ఇదే పరిస్థితి పంచాయతీ పరిధిలో మరో రెండు చోట్ల నెలకొంది. కాల్వలో నీటిని తగ్గించాం. మోటార్ల ద్వారా తోడిస్తే నీరు ఎటూ పోయే మార్గం లేదు.

–కోట శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు